

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

ప్రత్యామ్నాయ పంటలే లాభసాటి



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 200 పేజీలు - 08 వెల - 05/-

శుక్రవారం 17-07-2026


## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ
- డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్
- సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి
- ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు
- పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

2లో



అమరావతి, పోలవరం పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

# అమరావతిలో జగన్నాథ రథయాత్ర..

బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం

- రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర
- బంగారు చీపురుతో ఊడ్చి రథాన్ని లాగిన సీఎం చంద్రబాబు
- ఆధ్యాత్మికతతోనే ఒత్తిడి దూరం అవుతుందన్న ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని ప్రకటన




*ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలిసారిగా జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీలో నిర్వహించే సంప్రదాయ క్రతువు తరహాలో రథం ముందు భాగాన్ని బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి చంద్రబాబు తన సేవను చాటుకున్నారు. అనంతరం జగన్నాథుడు, బలభద్ర, సుభద్రలు ఆశీనులైన రథాన్ని తాడుతో లాగి యాత్రను ప్రారంభించారు.*



ఈ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, స్థానిక శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, వేలాదిగా భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఈ సందర్భంగా, అమరావతి బృహత్ ప్రణాళిక చిత్రపటాన్ని శిరస్సుపై ధరించి, రాజధాని నగరం విశ్వనగరంగా ఎదగాలని ఆయన జగన్నాథ స్వామిని ప్రార్థించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. దేశంలో పూరీ జగన్నాథ రథయాత్రకు ఎంతో విశిష్టత ఉందని, అందరూ అక్కడికి వెళ్లలేరని, అలాంటిది తొలిసారిగా అమరావతిలో ఈ యాత్ర నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఈ యాత్రలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఇకపై ప్రతిఏటా అమరావతిలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని ఇస్కాన్ ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## ఏపీలో మళ్లీ కరోనా కలకలం... నలుగురి మృతి

- ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ వెలుగు చూసిన కరోనా కేసులు
- జూన్ 26 నుంచి జులై 16 వరకు 12 పాజిటివ్ కేసులు, నలుగురి మృతి
- కడప, విశాఖ, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో కేసుల గుర్తింపు
- అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు ఆరోగ్య శాఖ ఆదేశం
- ఆసుపత్రుల్లో మందులు, ఆక్సిజన్ సిద్ధం చేయాలని సూచన

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య

మిగతాది 2లో

## ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు

- కుడంకుళం అణు కేంద్రం నుంచి సున్నితమైన డేటా ఏదీ లీక్ కాలేదని స్పష్టీకరణ
- ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాలపై ఆందోళన అవసరం లేదని వెల్లడి
- గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం ఉండదని హామీ




2లో

కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై

## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి..

### 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

- భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి
- త్వరలో 'పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'కు రూపకల్పన
- పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు
- నిరర్ధక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం



రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మిగతాది 2లో

## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్

- ఇటీవల పవన్ కల్యాణ్ కు శస్త్రచికిత్స
- హైదరాబాదులో పవన్ నివాసానికి వెళ్లిన ఏపీ గవర్నర్
- ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైనం
- పవన్ ఇంటిలోని గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలపై చర్చ
- త్వరగా కోలుకుని విధుల్లో చేరాలని ఆకాంక్ష
- గవర్నర్ రాక పట్ల కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్



2

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

## ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల...

పాఠశాల నిర్వహణ కోసం రూ.2,000 మినహాయింపు, తల్లి ఖాతాలో రూ.13,000 జమ

- తల్లికి వందనం' పథకానికి రూ.10,120.78 కోట్లు మంజూరు
- 42.70 లక్షల మంది తల్లులు, 67.47 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకు రూ.15,000 ఆర్థిక సాయం
- 2026-27 విద్యా సంవత్సరానికి పథకం అమలుకు ఉత్తర్వులు




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఈ పథకం అమలు, మార్గదర్శకాల కోసం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం జీవో నెం.15, జీవో నెం.16 జారీ చేశారు. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్లు మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 42,70,802 మంది తల్లులకు, వారి 67,47,190 మంది పిల్లలకు లబ్ధి చేకూరనుంది. జులై 22వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రాపౌట్లను తగ్గించి, వారి చదువులో తల్లుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. గత విద్యా సంవత్సరం (2025-26) నుంచి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో



## సీతారామను పూర్తి చేస్తాం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్టు బీఆర్ఎస్ నేతల డ్రామాలు : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పభుత్వంపై బురద జల్లుతున్నారు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి :- గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం

మిగతాది 2లో

## 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరించిన వైఎస్ జగన్

- వైసీపీ కుటుంబ సభ్యుల కోసమే ఈ కొత్త యాప్ అన్న జగన్
- తాడేపల్లిలో జరిగిన పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రారంభం
- యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- పార్టీ బలోపేతానికి డిజిటల్ వ్యూహంతో ముందుకెళ్తున్న వైసీపీ




2

వైసీపీ తమ శ్రేణులను బలోపేతం చేసే దిశగా డిజిటల్ బాట పట్టింది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'జగన్ 2.0 సూపర్ యాప్'ను గురువారం ప్రారంభించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు.

# అమరావతిలో జగన్నాథ రథయాత్ర.. బంగారు చీపురుతో ఊడ్చి సేవ చేసిన సీఎం

ఈ సందర్భంగా ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్‌లు అందిస్తున్న సేవలను చంద్రబాబు కొనియాడారు.



దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 25 వేలకు పైగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షయపాత్ర నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున 500 కోట్ల మందికి ఆహారం అందించడం అరుదైన విషయమని ప్రశంసించారు. ఏపీలో 10 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా రోజూ 1.80 లక్షల మంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు వివరించారు. ఆధునిక జీవనశైలి వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం కుటుంబాలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, జీవితాల్లో ఒత్తిడిని దూరం చేసుకోవాలంటే ఆధ్యాత్మికత ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు. "మైక్రో ఫ్యామిలీలు కాదు, ఉమ్మడి కుటుంబాలు కావాలి. అదే మన భారతీయ సంప్రదాయం" అని ఆయన పిలుపునిచ్చారు. సమాజం ప్రశాంతంగా ఉండటానికి దేవాలయాలు దోహదపడతాయని, అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలను నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. భారతీయ సంస్కృతిని కాపాడేందుకు ఇస్కాన్ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. జగన్నాథ రథయాత్ర తలపెట్టగానే అమరావతిలో వర్షం కురిసి వాతావరణం చల్లబడటం శుభసూచకమని అన్నారు. ఆ జగన్నాథ స్వామి కృప రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# ఏపీలో ఈ నెల 22న 'తల్లికి వందనం' నిధులు విడుదల.

చి అమలవుతున్న ఈ పథకం కింద, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లికి, వారి పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఒక్కో బిడ్డకు ఏటా రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్, ప్రైవేట్ అన్-ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

### నిధుల కేటాయింపు, చెల్లింపు విధానం

ప్రతి విద్యార్థికి అందించే రూ.15,000 ఆర్థిక సహాయం నుంచి రూ.2,000 పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణ, పారిశుధ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మినహాయిస్తారు. మిగిలిన రూ.13,000 నేరుగా అర్హులైన తల్లుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, తల్లులను ఆర్థికంగా ప్రోత్సహించడం కూడా ప్రభుత్వ ఉద్దేశం.

పథకానికి అర్హతలు ఇవే:

'తల్లికి వందనం' పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం స్పష్టమైన అర్హత నిబంధనలను నిర్దేశించింది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు (గ్రా+వా) శాఖ ఆరు దశల ధ్రువీకరణ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది.

ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,000, పట్టణ ప్రాంతాల్లో రూ.12,000 మించకూడదు. భూమి: మాగాణి అయితే 3 ఎకరాల లోపు, మెట్టభూమి అయితే 10 ఎకరాల లోపు ఉండాలి. రెండూ కలిపి ఉన్నా 10 ఎకరాల పరిమితికి లోబడే ఉండాలి. వాహనం: కుటుంబంలో ఎవరి పేరు మీదా నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. అయితే, టాక్సీ, ట్రాక్టర్, ఆటోలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. విద్యుత్ వినియోగం: కుటుంబం నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లకు మించరాదు. దీని కోసం గత 12 నెలల సగటును పరిగణనలోకి తీసుకుంటారు. ఆస్తి: పట్టణ ప్రాంతాల్లో నివసించే కుటుంబానికి 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో మున్సిపల్ ఆస్తి ఉండకూడదు. ప్రభుత్వ ఉద్యోగం: కుటుంబ సభ్యుల్లో ఎవరూ కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగిగా లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగిగా ఉండరాదు. ప్రభుత్వ పింఛనుదారులకు కూడా ఇది వర్తించదు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నిర్దేశిత ఆదాయ పరిమితి లోపు జీతం తీసుకునే వారికి మినహాయింపు ఉంటుంది. ఆదాయ పన్ను: కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు కూడా ఆదాయపు పన్ను చెల్లింపుదారుగా ఉండకూడదు. చదువు: విద్యార్థులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాల/జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ వంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే కోర్సులకు ఈ పథకం వర్తించదు.

### ప్రత్యేక నిబంధనలు, చెల్లింపులు

అనాథలు: స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలల్లో చేరిన అనాథలు, వీధి బాలలు ఈ పథకానికి అర్హులే. సంబంధిత జిల్లా కలెక్టర్ వారి తరపున గార్డియన్-ఆపరేటెడ్ బ్యాంకు ఖాతాను తెరిచి, నిధులు సక్రమంగా అందేలా పర్యవేక్షిస్తారు.

ఆర్టీఈ విద్యార్థులు: విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల విషయంలో, ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును నేరుగా పాఠశాల యాజమాన్యానికి చెల్లిస్తారు. ఆ మొత్తం పోగా ఏమైనా మిగిలితే, దానిని తల్లి ఖాతాలో జమ చేస్తారు.

ఇతర స్కాలర్‌షిప్‌లు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు పొందుతున్నట్లయితే, ఆ పథకం కింద వచ్చే మొత్తాన్ని మినహాయించి, మిగిలిన బ్యాలెన్స్ మొత్తాన్ని 'తల్లికి వందనం' కింద చెల్లిస్తారు.

### అమలు షెడ్యూల్, ఫిర్యాదుల పరిష్కారం

పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా విద్యార్థులు, వారి తల్లుల వివరాలను సేకరించి, గ్రా+వా విభాగం ధ్రువీకరిస్తుంది. జులై 22న అర్హులు, అనర్హుల జాబితాలను సామాజిక తనిఖీ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం తర్వాత లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులను జమ చేయాలని ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. తప్పుడు సమాచారం ఇచ్చి లబ్ధి పొందినట్లు తేలితే, ఆ మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. పథకంపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే, గ్రా+వా కార్యాలయాల్లోని ఆన్‌లైన్ గ్రీవెన్స్ మెకానిజం ద్వారా పరిష్కరిస్తారు.

# పీపీపీతోనే వేగంగా అభివృద్ధి.. 'వీజీఎఫ్ విప్లవం'పై సీఎం చంద్రబాబు దృష్టి

తి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే 'ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0'ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. బలహీన వర్గాల విద్యార్థులను నైపుణ్యం ఉన్న మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు, రెసిడెన్షియల్ హాస్టళ్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీతారామను పూర్తి చేస్తాం





రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు. లక్ష?లాది ఎకరాలకు సాగునీరందించినట్టు ప్రచారం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించినట్టు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాల అనుమతులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్ట్‌లు నిర్వహిం చకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ సమస్యలు తలెత్తాయన్నారు. మిగిలిన బ్యారేజీల భద్రతపై కూడా నిపుణుల సూచనలు ఉన్నాయనీ, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబం ధించిన భూసేకరణలో ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం వేగంగా పరిహారం చెల్లింపులు చేస్తామని, అధికారులు ఈ అంశాన్ని ప్రాధాన్యం గా తీసుకోవాలని సూచించారు. కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి పొంగులేటి

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన అన్ని నీటిపారుదల పనులను నిజాయితీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్, వైరా--లంకసాగర్ ప్రాజెక్టులు, ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా సాధ్యమైనంత మేరకు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్ బాబు, బాగం నీరజదేవి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీఎస్ఈ యుగంధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం

# ఏపీలో మళ్లీ కరోనా కలకలం... నలుగురి మృతి

ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# 'జగన్ 2.0 సూపర్ యాప్'ను ఆవిష్కరించిన వైఎస్ జగన్

ఈ యాప్‌ను వైసీపీ కుటుంబం కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు పార్టీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది. కార్యకర్తలు ఈ యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతూ సంబంధిత లింక్‌ను కూడా పంచుకుంది. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో ఇది అందుబాటులో ఉంటుందని, సులభంగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రచార చిత్రాలను విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలో, జగన్ పార్టీ నేతలను ఉద్దేశించి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాలో తమ కార్యకర్తలు పోస్ట్ చేసే కంటెంట్‌ను తొలగిస్తున్నారని, ఈ క్రమంలో పార్టీ కోసం ఒక ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ యాప్ ద్వారా కార్యకర్తలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వ్యక్తం చేయవచ్చని, పార్టీతో నిత్యం అనుసంధానమై ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా నాయకులు, కార్యకర్తలు నిరంతరం సమన్వయంతో ఉండే అవకాశం ఉంటుందని జగన్ తెలిపారు. పార్టీ నిర్వహించే విలేకరుల సమావేశాలు, పర్యటనలు, అధికారిక ప్రకటనలు వంటి సమాచారం అంతా ఈ యాప్ ద్వారా ప్రతి కార్యకర్తకు చేరువవుతుందని అన్నారు. త్వరలోనే ఈ యాప్‌లో డిజిటల్ డైరీ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.

# హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్

తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గవర్నర్ ఆయన నివాసానికి చేరుకుని, ఆయన్ను ఆత్మీయంగా పలకరించారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలను, సలహాలను తప్పనిసరిగా పాటించాలని పవన్‌కు సూచించారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, ప్రజాసేవలో తన విధులను తిరిగి ప్రారంభించాలని గవర్నర్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ జస్టిస్ నజీర్, పవన్ కల్యాణ్ నివాసంలో ఉన్న గ్రంథాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించడం విశేషం. ఆ లైబ్రరీలో ఉన్న పలు పుస్తకాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయితలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రాసిన అనేక గ్రంథాలను చూసి, వాటిపై పవన్ కల్యాణ్‌తో ఉత్సాహంగా చర్చించారు. ఇద్దరి మధ్య పుస్తకాలపై ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన అభ్యర్థన మేరకు, జస్టిస్ అబ్దుల్ నజీర్ ఓ పుస్తకంపై తన సంతకం చేశారు. తన ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకు స్వయంగా సమయం తీసుకుని ఇంటికి వచ్చిన గవర్నర్‌కు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన పూర్తిగా మర్యాదపూర్వకంగా, ఆత్మీయ వాతావరణంలో సాగింది.

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు-2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

# ఇస్రో శాస్త్రవేత్తల రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి కీలక వ్యాఖ్యలు




కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన డేటా లీక్ వ్యవహారం, ఇస్రోలో కీలక శాస్త్రవేత్తల రాజీనామాలను నియంత్రించేందుకు ప్రవేశపెట్టిన నూతన విధానంపై వ్యక్తమవుతున్న ఆందోళనలపై కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. ఈ రెండు అంశాల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టుల భద్రతకు, పురోగతికి ఎలాంటి విఘాతం కలగదని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల 'వరల్డ్ లీక్స్' అనే రాన్సమ్‌వేర్ గ్రూప్, కుడంకుళం అణు విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సుమారు 19,000 ఫైళ్లను డార్క్ వెబ్‌లో బహిర్గతం చేసినట్లు వార్తలు వచ్చాయి. సుమారు 14.3 జీబీ డేటా కలిగిన ఈ ఫైళ్లలో ప్లాంట్ బ్లూప్రింట్లు, సరఫరాదారుల వివరాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై మంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ, ప్లాంట్‌కు సంబంధించిన ఎటువంటి సున్నితమైన సమాచారం లీక్ కాలేదని, వ్యూహాత్మక భద్రతకు ఎలాంటి ముప్పు లేదని తేల్చిచెప్పారు. ఈ డేటా లీక్ అనేది ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకరికి చెందిన థర్డ్-పార్టీ సర్వర్ నుంచి పాక్షికంగా జరిగినట్లు గుర్తించామని, దీనిపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని వివరించారు. మరోవైపు, గగన్‌యాన్ వంటి కీలక ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్న గ్రూప్ 'ఏ' శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది రాజీనామాలను తక్షణమే ఆమోదించవద్దని అంతరిక్ష విభాగం జులై 14న ఒక మెమో జారీ చేసింది. దీనిపై మంత్రి మాట్లాడుతూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయమని, ఉన్నత స్థాయిలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునేందుకే ఈ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'చాలామంది వస్తుంటారు, పోతుంటారు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ సైతం ఈ నిర్ణయం వల్ల ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని స్పష్టం చేశారు.

## జగన్నాథ రథయాత్ర అన్నప్రసాదానికి
# మార్కెట్ ప్రసాద్ కుటుంబం చేయూత.

**-ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణకు కూరగాయలు అందజేత.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా ఇస్కాన్




ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి నంద్యాలకు చెందిన ప్రముఖ వ్యాపారి మార్కెట్ ప్రసాద్ కుటుంబ సభ్యులు ఉదారంగా కూరగాయలను అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. రథయాత్రకు హాజరయ్యే వేలాది మంది భక్తులకు అన్నప్రసాదం సిద్ధం చేసేందుకు అవసరమైన కూరగాయలను మార్కెట్ ప్రసాద్ కుటుంబం సమకూర్చింది. ఈ సేవా కార్యక్రమంలో దిలీప్, కుమార్, సురేష్, జయకృష్ణ పాల్గొని ఏర్పాట్లకు సహకరించారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రసాద్ మాట్లాడుతూ, జగన్నాథ స్వామి సేవలో భాగస్వాములు కావడం తమ కుటుంబానికి దక్కిన అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం అందించే పవిత్ర కార్యక్రమానికి సహకరించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి ధార్మిక, సేవా కార్యక్రమాలకు తమ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్ ప్రసాద్ కుటుంబం అందించిన సహకారానికి ఇస్కాన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, భక్తుల సేవలో భాగస్వాములైన వారి సేవాస్ఫూర్తిని అభినందించారు.

# హలో బహుజన చలో నంద్యాల..

పాణ్యం జులై 19 పల్లె వెలుగు : నంద్యాల జిల్లా కేంద్రం లోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ నందు జరిగే బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభకు బహుజన వాదులు, బహుజన ఉద్యోగులు,



న్యాయవాదులు, చార్టెడ్ అకౌంట్, వృత్తి నిపుణులు, వివిధ సంఘాల నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి పిలుపు.యువజన విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు బిజినవేముల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాణ్యం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు గోడపత్రికలు విడుదల చేశారు.సామాజిక న్యాయం కోసం రాజ్యాధికారంలో సమాన వాటా కోసం ఆర్థిక సమానత్వం కోసం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు రచించిన రాజ్యాంగంలో లికించిన అంశాలు అమలు చేయాలని,రాజ్యాంగ పరిరక్షణ,ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, విద్య వైద్య రంగాలలో సమాన అవకాశాలు, న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు అమలు చేయాలని, చట్టసభలలో బీసీలకు 44% రిజర్వేషన్లు కల్పించాలని, గ్రేటర్ రాయలసీమ గిరిజనులకు ఐదు ఎమ్మెల్యే రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నిధుల కోసం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత బహుజనులకు అన్ని రంగాలలో జనాభా దామాషా ప్రకారం వాటా కోసం, అన్ని వర్గాల బహుజన ఉద్యోగులు మరియు ప్రొఫెషనల్ అధిక సంఖ్యలో పాల్గొని చలో నంద్యాల గ్రేటర్ రాయలసీమ బహుజన ఉద్యోగుల న్యాయభేరి సభను విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజర్వేషన్ల పరిరక్షణ సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెరుగు శివకృష్ణ పిలుపునిచ్చారు. శ్రీనివాసులు, బాలరాజు, ప్రతాప్, వనం వెంకటాద్రి, నాగరాజు, శ్రీనివాసరావు,గోపాల్, వేణు, నాగరాజు,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ కళాశాల నుంచి డాక్టరేట్ ను అందుకొన్న జి. సులక్షణ



నంద్యాల ప్రతినిధి. జూలై 16 . (పల్లె వెలుగు ):నంద్యాల రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీఎంసీఈటీ) లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగానికి చెందిన అధ్యాపకురాలు జి. సులక్షణ జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అనంతపురం నుండి పీహెచ్డీ పట్టాను విజయవంతంగా పూర్తి చేశారు. డా. కె. గోవర్ధన్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించిన ఆమె, 2026 జూలై 10న డాక్టరేట్ను సాధించారు. ఆమె పరిశోధనా సిద్ధాంతం "ఎనర్జీ ఎఫిషియెంట్ డేటా అక్యుమ్యులేషన్ అండ్ క్యూఓఎస్ ఎన్హాన్స్డ్ రూటింగ్ ఇన్ డబ్ల్యూఎస్ఎన్ఎస్ యూజింగ్ మొబైల్ సింక్" అనే అంశంపై సాగింది. ఈ పరిశోధన వైర్లెస్ సెన్సార్ నెట్వర్క్లలో శక్తి వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం, డేటా సేకరణను సమర్థవంతంగా నిర్వహించడం మరియు సేవా నాణ్యత ను మెరుగుపరచే రూటింగ్ విధానాల అభివృద్ధికి దోహదపడుతుంది.ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ డా. ఎం. శాంతిరాముడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివరాం, కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. జయచంద్ర ప్రసాద్ , డీన్ డా. డి.వి. అశోక్ కుమార్ , సి.ఎస్.ఈ. (డేటా సైన్స్) విభాగాధిపతి డా. బి. భాస్కర్ రావు , మరియు అధ్యాపక బృందం డా. జి. సులక్షణ ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి విద్యా, పరిశోధనా రంగాల్లో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# నేర నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యం.

**జిల్లాలో కొనసాగుతున్న "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం.**








పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా రాత్రి వేళలలో గస్తీ ,విజిబుల్ పోలిసింగ్, రోడ్డు ప్రమాదాలు నియంత్రించుటకు ప్రతిరోజు జిల్లాలోని ప్రధాన రహదారులలో స్టాప్ – వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహించడంతో పాటు వాహనాలు తనిఖీ చేయాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయడంతో పాటు లాడ్జిలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులు, భద్రతా ప్రమాణాలను పాటించాలని మరియు ప్రైవేట్ వాహనాలు,ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులలో ముఖ్యంగా రాత్రి పూట తిరిగే వాహనాలలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు మరియు సరైన జాగ్రత్తలు పాటించాలని బస్సులలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

అలాగే రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం నిర్వహించి వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే డయల్–100/112కు
సమాచారం అందించాలని సూచించారు.

## మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి
# అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి.

**● 120 సంవత్సరాల చరిత్ర కలిగిన మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి ని అడ్డకట్ట వేయలేరా. ● ప్రజల సొమ్ము అవినీతిపరుల పాలు. ● కె ప్రసాద్ సిపిఐ పట్టణ కార్యదర్శి .**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు, ఏఐటియుసి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి శ్రీనివాసులు, ధనుంజయ్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మతో కలిసి సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ నంద్యాలలో 120 ఏళ్ల చరిత్ర కలిగిన




మున్సిపాలిటీలో ఎన్నడూ లేని విధంగా ప్రజల సొమ్మును కాజేస్తున్నారు . ఇంటి దొంగను... కూడా పట్టుకోలేదని సామెత ప్రకారం మున్సిపాలిటీలో నీ గ్యారేజీలో వెహికిల్లకు ఆయిల్ మార్చడంలో గాని షేర్ పాస్టులు మార్చడంలో గాని టైర్లు మార్చడంలో గాని ఇలా అనేక వాటిపైన అదనపు బిల్లులతో అవినీతి జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా బయట పాగింగ్ బేరింగ్ తదితర వాటిలో కూడా ప్రజల సొమ్ము వృధా అవుతుందని అన్నారు. ఈ అవినీతి గురించి మున్సిపల్ కమిషనర్ కి తెలియక జరిగితే వాటిపై నిజాలు తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ కి తెలిసి ఉంటే కనుక భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితిగా పట్టణ ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు .

# గోల్కొండ బోనాలు ఆధ్యాత్మిక సాంస్కృతిక చైతన్యానికి ప్రతీక

హైదరాబాద్. జూలై 16. పల్లె వెలుగు తెలంగాణ



కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జూలై 16వ తేదీ గురువారం నాడు గోల్కొండలో శ్రీశ్రీశ్రీ జగదాంబిక అమ్మవారికి బోనం ధూప దీప నైవేద్యం సమర్పించే కార్యక్రమం జరిగింది.తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాలు ఉత్సవ సమితి నిర్వహించిన కుమ్మర్ల తొలి బోనాల జాతరలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులు మాజీ మంత్రి వి .హన్మంతరావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకైనా హైదరాబాద్ గోల్కొండ బోనాలుకుమ్మర్లు అమ్మవారికి సమర్పించే కుమ్మర్ల బోనాల పండుగ సమాజంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక చైతన్యానికి ప్రతిక అని అన్నారు.అమ్మవారి స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో రాణించేట్లు శక్తి యుక్తులను సంతరించుకోవాలని మహిళా సాధికారిక ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించే సారదులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సతీమణి భట్టి నందిని మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని కరువు కాటకాలు తీరాలని అన్నారు. అమ్మవారికి తొలి బోనం ఎత్తే కుమ్మర్లు సమాజానికి ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కుమార సంఘం 880/2014 రాష్ట్ర శాఖ అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు పత్రికా రచయిత నేదునూరి కనకయ్య అతిథిగాపాల్గొని మాట్లాడుతూ తెలంగాణ కుమ్మర్ల సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కుమ్మరి వృత్తి నైపుణ్యం కళావైభవాన్నీ చాటడంలో బోనాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని అనాదిగా గోల్కొండలో అమ్మవారికి కుమ్మరికొండలో (మట్టికుండలో) అన్నం వండి కుమ్మర్లు అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. మట్టికుండలో బోనంశ్రేష్ఠమైనదని.శాస్త్రీయతకు పర్యావర పరిరక్షణకు ప్రజారోగ్య రక్షణకు దోహద పడుతుందని అన్నారు.తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాలు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మగౌరవ భవన్ ఉపాధ్యక్షులు కొల్లూరు అనిల్ కుమార్ మాట్లాడుతూ కుండ సమాజంలో శుభ కార్యక్రమాలకు దర్శనమని "ప్రకృతే పరమాత్మ "అని ప్రకృతిలోని మట్టితో తయారు చేసిన కుండలోనే అమ్మవారికి భోజనం నైవేద్యంగా సమర్పించడం వల్ల శుభాలు కలుగుతాయన్నారు .తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాల ఉత్సవ సమితి కోశాధికారి దామ సత్యనారాయణ మాట్లాడుతూ కుమ్మర్లను గ్రామ దేవాలయాల్లో పూజారుగా నియమించి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తెలంగాణ కుమ్మర్ల గోల్కొండ బోనాలు ఉత్సవ సమితి కమిటీ చైర్మెన్ ఆర్ కుమార్ అధ్యక్షులు ఆర్ విజయ కుమార్ ప్రేమ కుమార్ ఉపాధ్యక్షులుప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్ కుమార్ ఉపాధ్యక్షులు కాకులారం శంకర్ రావులకొల్లు ప్రకాష్ కుమ్మరి నరసింహులు శ్రీ సిలివవేరు లాలయ్య సహాయ కార్యదర్శి కుమ్మరి రామచంద్రయ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ చంద్రమోహన్ రావులకొల్లు రాంకుమార్ దామా నంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగోడులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా పరిపాలన చేపట్టిన "వన్ మంత్ -- ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న వెలుగోడు మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. భూ సంబంధిత అంశాలతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను నేరుగా స్వీకరిస్తారని తెలిపారు. వెలుగోడు మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యామ్నాయ పంటలే లాభసాటి

-శాస్త్రవేత్త రమాదేవి -ఏడి చెన్నయ్య..





బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 17 :ప్రస్తుత ఖరీఫ్ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రైతులు పంటల సాగులో మెలకువలు పాటించి నష్టాల నుంచి బయట పడవచ్చని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త రమాదేవి తెలిపారు. బండి ఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు రైతు సేవ కేంద్రంలో గురువారంరైతు శిక్షణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సమక్షంలో నంద్యాల డిఆర్సి డిడి చెన్నయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎల్ నినో ముప్పుపై కేంద్ర ప్రభుత్వంతో పాటు పలువురు నిపుణులు ముందుగానే హెచ్చరించారన్నారు,ఈ క్రమంలో ఖరీఫ్ సాగు రైతులకు ఎంతో కీలకం, అని అన్నారు.ఈ సీజన్లో రైతులు ఎక్కువగా వరి,పత్తి,మొక్కజొన్న, ఆముదం, కొర్ర, సజ్జా, సోయాబిన్ పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. అనిచ్చిత వాతావరణం, సకా లంలో వర్షం కురవకపోవడం, తక్కువ వర్షం వల్ల మెట్టనెలలో ప్రధాన పంటలైన వరి మొక్కజొన్న సాగుతో రైతులు నష్టాలు చవి చూసే అవకాశం ఉంది కనుక,వాతావరణ పరిస్థితుల వల్ల సవాళ్లు ఎదురైనప్పుడు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులతో ముం దుకు సాగితే ఆరోగ్యకర పంటలు పండించడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చు అని తెలిపారు. ఈ క్రమంలో రైతులు పంటల సాగులో నీటి సంరక్షణ, తేమ నిర్వహణ, అంతర పంటలసాగు, స్థానిక పరిస్థితులకు అనువైన ప్రత్యామ్నాయ పంటల విధానాలపై దృష్టి సారించాల్సి ఉంది అని తెలిపారు.

### అంతర పంటలతో లాభదాయకం

రైతులు ఒక సమయంలో ఒకే పంటను సాగు చేయడం వల్ల ఏటా నష్టపోతున్నారని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.వివిధ ప్రాంతాల్లో సాలినా 550 మీల్లిమీటర్లు నుంచి 1100 మీల్లిమీటర్ల వరకు వర్షపాతం నమోదవుతోంది. సరైన ప్రణాళిక అవగాహన వల్ల రెండు లేదా మూడు పంటలను ఒకేసారి సాగు చేయవచ్చునని అన్నారు.సహజ వనరులైన సూర్యరశ్మి, వర్షపు నీరు పోషకా లను సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే అంతర పంటలు వేసుకోవడం తప్పనిసరి. వాలుక అడ్డంగా దున్నడం, విత్తడం, అంతరకృషి చేయడం వల్ల వర్షపు నీరు వాలుతలంలో వ్యర్ధ పోకుండా సుమారు 10 శాతం నీటి ప్రవాహ వేగం తగ్గి భూమిలోకి ఇంకిపోవడానికి అవకాశం కలుగుతుంది. నీటి ప్రవాహవేగం తగ్గడం వల్ల నేల కోతకు గురికాకుండా ఉంటుంది.

### పంట బీమా పంట నమోదు తప్పనిసరి

రానున్న వర్ష బాగా పరిస్థితులలో రైతులు సాగు చేసిన పంటలను తప్పకుండా పంట నమోదు చేసుకొని ముందస్తుగా పంట బీమా చేసుకోవాలని ఏఓ పవన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు డిఆర్సి ఏఓలు వెంకటేశ్వర్లు చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది లక్ష్మయ్య శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు నరసింహులు పలువూరు రైతులు పాల్గొన్నారు.

# నమస్తే ఎమ్మిగనూరు

ప్రజా సమస్యలపై పోరుబాట,,,,,







ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 16 ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి కి గంజహల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి గంజహల్లి గ్రామంలోని బడేసాబ్ దర్గా వద్ద ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, వ్యవసాయ మరియు వ్యాపార రంగాలు మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు రాజీవ్ రెడ్డి గారు తెలిపారు. గ్రామంలో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు అందజేసిన వినతిపత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ చెరువును పరిశీలించిన రాజీవ్ రెడ్డి గారు, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువు మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అక్రమ మట్టి తరలింపును అరికట్టాలని మీడియా సమావేశంలో డిమాండ్ చేశారు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయినా ప్రజలకు చెప్పుకోదగ్గ మేలు జరగలేదని విమర్శించారు. రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు సూపర్ సిక్స్ హామీల పేరుతో మోసపోయారని పేర్కొంటూ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గ్రామంలో ఎస్ఐఆర్ (ూ×=) ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసిన నాలుగు బూత్‌ల బీఎల్ఏలను శాలువాలతో సన్మానించి అభినందించారు. గంజహల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి, బూత్ లెవెల్ ఆఫీసర్ (దీూా)తో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. గ్రామంలో ఓటరు జాబితా ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, 2029 ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ఆశీర్వదించి అధికారంలోకి తీసుకువస్తారని రాజీవ్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గంజహల్లి గ్రామ నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి జీపీడీపీ ప్రణాళికలే కీలకం

- బేతంచెర్లలో అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం.







బేతంచెర్ల, పల్లె వెలుగు ప్రతినిధి జూలై 16: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక లిజీపీడీపీ లి పై బేతంచెర్ల మండల స్థాయిలో గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల డిప్యూటీ ఎంపీడీవో బి. మల్లికార్జున, ఏవో ఇద్రీస్ భాషా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డిలిమాట్లాడుతూ జీపీడీపీ ఉద్దేశాలు, గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, గ్రామసభల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, శాఖల సమన్వయం, అందుబాటులో ఉన్న నిధుల వినియోగం, అభివృద్ధి పనుల ప్రాధాన్యత నిర్ణయం వంటి అంశాలపై అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు.

జీపీడీపీ ద్వారా గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, ఆరోగ్యం, వీధి దీపాలు, మురుగునీటి పారుదల, హరితాభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తూ గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన ప్రణాళికల ద్వారానే గ్రామాల సమగ్ర, సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణలో జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లుగా మీూం శిక్షణ పొందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు ఐ. నాగప్రసాద్, రవితేజ, సునీల్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్ నాయక్ వనరుల వ్యక్తులుగా వ్యవహరించి జీపీడీపీ ప్రణాళిక తయారీ, ఆన్‌లైన్ నమోదు, కార్యాచరణ విధానం తదితర అంశాలపై పాల్గొన్న అధికారులకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో ్రాణూలు, డిజిటల్ అసిస్టెంట్లు ణూం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు జూూం తదితర అధికారులు పాల్గొన్నారు.

## బేతంచెర్లలో AP ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

టెన్త్, ఇంటర్ చదవాలనుకునే వారికి సువర్ణ అవకాశం



బేతంచెర్ల, పల్లె వెలుగు( జూలై 16:- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,ూూ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు భాగ్యోదయ హైస్కూల్ బేతంచెర్ల కో-ఆర్డినేటర్, సీనియర్ ఉపాధ్యాయులు కట్టా పరమేష్ తెలిపారు. గురువారం స్థానిక భాగ్యోదయ హైస్కూల్ నందు పాఠశాల లీగల్ అడ్వైజర్ నందిపల్లె నారాయణ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కట్టా పరమేష్ మాట్లాడుతూ, “చదువు మధ్యలో మానివేసినవారు, గృహిణులు, డ్రాప్ అవుట్ విద్యార్థులు, రెగ్యులర్ టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయినవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ పదోన్నతుల కొరకు ఓపెన్ స్కూల్ లో చేరవచ్చు” అని అన్నారు. ప్రతి రెండవ శనివారం, ప్రతి ఆదివారం బేతంచెర్ల పుల్లమ్మ కల్లం వద్ద గల భాగ్యోదయ హైస్కూల్ లో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు క్లాసులు నిర్వహిస్తామన్నారు. అతి తక్కువ ఖర్చుతో సులభంగా టెన్త్, ఇంటర్ కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కోర్సు పూర్తి చేసిన తర్వాత రెగ్యులర్ కోర్సుల్లో చేరవచ్చని, అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగాలకు ఈ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు మార్చి నెలలో రెగ్యులర్ విద్యార్థులతో పాటే జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల పనివేళల్లో భాగ్యోదయ హైస్కూల్ లో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, జ్యోతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## రాజీవ్ రెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలి.

- ఎమ్మిగనూరు టీడీపీ పట్టణ కమిటీ నాయకులు

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 16 ఎమ్మిగనూరు పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో



గురువారం నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, ఎమ్మిగనూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు ధామ నరసింహులు, టౌన్ ఉపాధ్యక్షుడు కరీముల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేంద్ర బాబు, టౌన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యూకే వీరేంద్ర, పట్టణ కోశాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి, టీడీపీ పార్టీపై రాజీవ్ రెడ్డి అసత్యాలు, అవాస్తవ ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు.వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి రాజీవ్ రెడ్డి వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు. ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజలకు వెల్లడించాలని, లేకపోతే తప్పుడు ప్రచారాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిందని నాయకులు పేర్కొన్నారు. గంజిల్లా గ్రామంలో మట్టి తవ్వకాలపై అవినీతి, అక్రమాలు జరిగాయంటూ చేసిన ఆరోపణలను విజయలక్ష్మి తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఆరోపణలు కాకుండా వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని రాజీవ్ రెడ్డికి సూచించారు.

## ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కృషి ఫలితమే

## హాస్టల్ బిల్డింగులు 60, 70% శాతం పూర్తి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆల్ మేవా, “నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ” కృషి ఫలితంగా, “పిఎంజేవికే” పథకం క్రింద పైన పేర్కొన్న నాలుగున్నర ఎకరాల స్థలంలో, నాలుగు హాస్టల్ బిల్డింగులు 60 - 70% పనులు గత ప్రభుత్వ హయాంలో పూర్తయి, ఇప్పుడు మిగతా పనులు పూర్తి అవుతున్నాయి. పూర్తి అయిన పిదప ఈ బిల్డింగ్లను మైనారిటీ వెల్ఫేర్ శాఖకు అప్పజెప్పవలసి ఉన్నది. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీలో 240 మంది (అధిక శాతం విద్యార్థినులు) విద్యార్థులు మైనార్టీ వెల్ఫేర్ కు చెందిన సొంత హాస్టల్ భవనాలు లేక ఈ విద్యార్థిని, విద్యార్థులు ఎస్సీ ఎస్టీ మరియు బీసీ వెల్ఫేర్ హాస్టల్ల లో, వాటి వార్డెన్ల దయాదక్షిణ్యాలతో తాత్కాలికంగా ఉంటున్నారు. కాబట్టి ఈ విద్యార్థులను కొత్తగా తయారైన భవనాలకు, వార్డెన్లను మరియు అన్ని సదుపాయాలను కలిగించి వారికి కాలేజీకి రానుపోను ఏపీఎస్ఆర్టీసీ బస్సులు కేటాయించి వారి రక్షణ కోసం ఈ ప్రాంతంలో ఒక పోలీస్ పికెట్ను ఏర్పాటు చేయాలని ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, నంద్యాల ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు మైనారిటీ శాఖ మంత్రివర్యులు జనాబ్ ఎన్ ఎం డి. ఫరూక్ కి డిమాండ్ చేస్తున్నాయి. పై నాలుగు బిల్డింగులతో పాటు ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల భవనం మరియు సద్భావన భవన్ ( కమ్యూనిటీ హాల్) కూడా మంజూరు అయ్యి తగిన సమయం లో భవనాలు కట్టలేక పోవడం వల్ల నిధులు వెనక్కి వెళ్లిపోవడం జరిగింది. కాబట్టి ఉర్దూ కాలశాల భవనము మరియు సద్భావన భవనం కోసం కూటమి ప్రభుత్వంలోని మైనారిటీ నాయకులు సాధించి నంద్యాల ప్రజలకు కానుకగా ఇవ్వవలెనని కోరుకుంటున్నాము. ప్రస్తుత కలెక్టర్ ఈ భవన సముదాయాలను ఇతర డిపార్ట్మెంట్లకు కేటాయించడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలియ వస్తున్నది, దీనిని నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ మరియు ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తున్నాయి. గత ఏడేళ్లుగా కష్టపడి సాధించుకున్న ఈ భవనాలను వాటిని ఏ ఉద్దేశంతో నైతే ప్రభుత్వం కట్టడం జరిగిందో వాటికే కేటాయించాలని, అలా చేయని పక్షంలో ప్రజా ఉద్యమం ద్వారా సాధించుకుంటామని తెలియజేస్తున్నాము.

# దళిత వాడలలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలి.

-కెవిపిఎస్ ఆధ్వర్యంలో సామాజిక శంఖారావం.

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణం అరుణ్ జ్యోతి నగర్ ఏరియా నందు కెవిపిఎస్




ఆధ్వర్యంలో సామాజిక శంఖారావం లో భాగంగా కాలనీ ప్రజలతో సమస్యలపై కెవిపిఎస్ పట్టణ నాయకులు లక్ష్మన్న, సిఐటియు కార్యదర్శి తిప్పన్నా, డివైఎఫ్ఐ నాయకులు నాగరాజు, తదితరులు సర్వే నిర్వహించడం జరిగింది. అనంతరం మీరు మాట్లాడుతూ అరుణ్ జ్యోతి నగర్ నందు మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఎన్నికల ముందు పాలకులు స్త్రీలకు మరుగుదొడ్ల సమస్య పరిష్కారం చేస్తామని హామీలు అయితే ఇస్తున్నారు తప్ప పరిష్కారం వైపు చూడడం లేదని వారు తెలిపారు. అవునా ఇప్పటికైనా సంబంధం అధికారులు వెంటనే స్పందించి దళితవాడలో స్త్రీలకు మరుగు దొడ్లు నిర్మించాలని వారు తెలిపారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. కాలనీ నందు ఉన్న మురుగు కాలువ పూడిక తీయకపోవడంతో దుర్వాసన నానా అవస్థలు పడుతున్నారు నిత్యం అనారోగ్యాలకు నిలయంగా మారే దౌర్భాగ్య పరిస్థితి ఉందని వారు తెలిపారు. కావున మురుగు కాలువపై కల్వర్టు నిర్మించాలని వారు కోరారు.

# ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ.

**నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలోని గోపాలకృష్ణ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గురువారం ఆకస్మికంగా



తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా డీఏపీ, యూరియా విక్రయాలను ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్, బిల్లులు, ధ్రువపత్రాలు, భౌతిక నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఏపీఏఐఎంఎస్ ద్వారా నిర్వహించాలని, స్టాక్ రిజిస్టర్, ఐఎఫ్ఎంఎస్ వివరాలు, భౌతిక నిల్వలు ఒకే విధంగా ఉండాలని ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించరాదని, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎరువుల కొనుగోలుకు ఇతర ఉత్పత్తులను బలవంతంగా విక్రయించరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు--1985 ప్రకారం చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం కొత్తపల్లి సమీపంలోని జీలుగ పచ్చిరొట్ట పైరు సాగు చేసిన పొలాన్ని సందర్శించిన ఆయన, ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట పంటను సాగు చేసి నేలలో కలియదున్నడం ద్వారా నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

# ఇంటింటికీ కమిషనర్ పర్యటన.

**- ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న బి. శేషన్న.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పట్టణ ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడమే లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న గురువారం పట్టణంలోని పలు



కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో నేరుగా మాట్లాడిన కమిషనర్, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, చెత్త సేకరణ, రహదారులు తదితర పౌర సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, డ్రైనేజీల పరిస్థితి, వీధుల పరిశుభ్రతను కమిషనర్ స్వయంగా పరిశీలించి, అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు కమిషనర్ వెంట పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన ఏపీ రాష్ట్ర నేతలు, టిడిపి ముఖ్య నాయకులు

పల్లె వెలుగు –ప్యాపిలి విజయవాడలోని కేంద్ర గ్రామీణాభివృద్ధి సమాచార సాంకేతిక శాఖల



సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాసంలో పలువురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు, టిడిపి ముఖ్య నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నాయకులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీలో మల్లే ఈశ్వర్ వడ్డెర (ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్) చల్లా అనుదీప్ కుమార్ (జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు టిడిపి రాష్ట్ర యువ నాయకులు ?శ్రీ సయ్యద్ అక్బర్ వలి టిడిపి మైనారిటీ సెల్ ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి

పగడాల రాజేష్ ఐ టి డి పి ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి పెనుగొండ కుళ్లాయి స్వామి మేకలంటి రాజు మన్నెపు రాజేష్ తదితరులు ఉన్నారు. ఈ భేటీలో భాగంగా పలు సామాజిక, ప్రాంతీయ అభివృద్ధి అంశాలపై మంత్రి గారితో నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, తెలుగు రాష్ట్రాల ప్రగతికి కేంద్ర మంత్రిగా శ్రీ పెమ్మసాని చంద్రశేఖర్ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల పక్షాన నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు పార్టీ బలోపేతానికి యువత, సీనియర్ నాయకులు అంతా కలిసికట్టుగా పనిచేయాలని, నిరంతరం ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

# ప్యాపిలి మండలంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల విస్తృత పర్యటన!

**పలు గ్రామాల్లో ప్రజా సమస్యల పరిశీలన ౖ అధికారులకు తక్షణ ఆదేశాలు**

**☛ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీలో నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తి**







పల్లె వెలుగు –?ప్యాపిలి డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గురువారం ప్యాపిలి మండలంలో తుఫాను వేగంతో విస్తృతంగా పర్యటించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన.. తాగునీటి ప్రాజెక్టుల పురోగతి, ప్రజల సమస్యలు, పాఠశాలల వసతులను స్వయంగా పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

?మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో గోరుకల్లు రిజర్వాయర్ నుండి ఏర్పాటు చేస్తున్న వాటర్ గ్రిడ్ పైప్లైన్ పంప్ హౌస్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి స్వయంగా సందర్శించారు. పనుల పురోగతి, నీటి సరఫరా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన.. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాలకు త్వరితగతిన వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీటి సరఫరా ప్రారంభించి, ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.?బావిపల్లె క్రాస్ సమీపంలో తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా భారీగా నీరు వృథా అవుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోట్ల, వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి, లీకేజీని తక్షణమే మరమ్మతు చేసి నీటి వృథాను నివారించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.?అనంతరం మండలంలోని హుస్సేనాపురం, సిద్ధనగట్టు, కొమ్మమర్రి, నేరేడుచెర్ల గ్రామాల్లో ఎమ్మెల్యే కోట్ల పర్యటించి, గ్రామస్తులతో నేరుగా సమావేశమయ్యారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీరు, రహదారులు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

?"ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం వహించరాదు. ప్రతి సమస్యను ప్రాధాన్యతతో తీసుకుని తక్షణమే పరిష్కరించాలన్నారు.

?పర్యటనలో భాగంగా సీతమ్మతండా గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో విద్యార్థులకు భోజనం ఆలస్యంగా అందుతున్న విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వం జీతాలు చెల్లిస్తున్నది విద్యార్థులకు మెరుగైన సేవలు అందించడానికేనని స్పష్టం చేశారు. చిన్నారుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఏమాత్రం సహించేది లేదని, ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని, అధికారులను హెచ్చరించారు. పాఠశాలలో భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు, తాగునీరు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు, సంక్షేమం కోసం ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కోట్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ యాదవ్, సుదర్శన్, రామకృష్ణ, రాము, లాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నేరడుచర్ల వెంకటేష్,కృష్ణారెడ్డి, శ్రీరాములు, కాంతారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫైర్ ఇంజన్ ఆఫీసును మరోచోటికి మార్చాలి.

**ఆదోని ఫైర్ ఇంజన్ ఆఫీసు మరోచోటికి తరలించి సబ్ రిజిస్టర్ ఆఫీస్ అభివృద్ధి చేయాలి.**

**మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయం మరియు ఫైర్ స్టేషన్ ఒకే ఆవరణలో ఉండడంతో ఫైర్ ఇంజన్ వాహనం బయటకు రావడానికి ఇబ్బంది కలుగుతోందని ఏకంగా సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వచ్చే వాహనాలను రాకుండా రోడ్డు పై నిలబెట్టటం అన్యాయం. రిజిస్ట్రేషన్ ఆఫీస్ అంటేనే డబ్బుతో కూడుకున్న వ్యవహారం. కాబట్టి వాహనాలను దూరంగా ఉంచి డబ్బులు కార్యాలయానికి తీసుకెళ్లాలి అంటే దొంగతనం భయం ఉండనే ఉంటుంది. ప్రభుత్వానికి ఆదాయం ఇస్తున్న ప్రజలకు అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడం సిగ్గుచేటు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చి కోట్లాది రూపాయలు పన్ను రూపంలో చెల్లించే ప్రజలకు మనం ఇచ్చే మర్యాద ఇదేనా అని అధికారులను మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి తరఫున ప్రశ్నిస్తున్నాము. పెరుగుతున్న జనాభా మరియు వాహనాల సంఖ్య దృష్ట్యా ప్రభుత్వం ఫైర్ సర్వీస్ కార్యాలయాన్ని వై యం కె స్కూల్ బ్రిడ్జ్ కిందకు గాని, పశువుల ఆసుపత్రి లేక టిబిపి కార్యాలయానికి గాని తరలించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి యం హెచ్ పి యస్ తరపున విజ్ఞప్తి చేస్తున్నాము. ఫైర్ ఇంజన్ వాహనం ప్రస్తుతం ఉన్న ఇరుకు కార్యాలయం ఇరుకు రోడ్లను దాటి అగ్ని ప్రమాద స్థలానికి చేరుకునేలోపు అక్కడ మిగిలేది బూడిదే. నిప్పును ఆర్పేందుకు బయలుదేరిన ఫైర్ ఇంజన్ వాహనం ఇరుకు రోడ్ల వల్ల ఆలస్యం కావడంతో వెళ్లి బూడిదను ఆర్పిన ఉదంతాలు ఉన్నాయి. కావున ఆలస్యం చేయకుండా ఫైర్ ఇంజన్ కార్యాలయాన్ని మరో చోటకు తరలించి ఆస్థలాన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు కేటాయించి అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలని మరొక్కసారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము.

-----------------------------------------

# మెగా పీటీఎం ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలి.

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**● జూలై 24న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 4వ మెగా పీటీఎం నిర్వహణ. ● తల్లికి వందనం సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.** ఈ నెల 24న నిర్వహించనున్న నాలుగో మెగా పేరెంట్ – టీచర్ మీటింగ్ (పీటీఎం)ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మెగా పీటీఎంపై సంబంధిత అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రమే మెగా పీటీఎంను నిర్వహించాలని, కార్యక్రమంలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల విద్యా ప్రగతి, ఆరోగ్యం, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిల్లల ద్వారా స్థానికంగా లభించే పర్యావరణహిత సామగ్రితో ఆహ్వాన పత్రికలు తయారు చేసి తల్లిదండ్రులకు అందించాలని సూచించారు. గతంలో ఎక్కువగా తల్లులే హాజరైన నేపథ్యంలో ఈసారి తండ్రులు కూడా తప్పనిసరిగా పాల్గొనేలా ప్రత్యేక ఆహ్వానాలు పంపాలని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఇద్దరూ కలిసి హాజరయ్యేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మెగా పీటీఎంపై అన్ని సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

**తల్లికి వందనం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన ఆధార్ అనుసంధానం, ఎన్‌పీసీఐ ఇన్‌యాక్టివేషన్, బ్యాంకు ఖాతా – ఫోన్ నంబర్ లింకేజీ, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 76 ప్రత్యేక ఆధార్ కేంద్రాల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఎంఈఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో సుమారు 2,900 పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ నెల 21, 22 తేదీల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమయ్యే నేపథ్యంలో అర్హులందరికీ ఒకేసారి ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

**లీప్ యాప్ వినియోగం తప్పనిసరి**

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల పర్యవేక్షణ తదితర వివరాలు లీప్ యాప్ ఆధారంగానే సమీక్షించబడుతున్నందున యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మెగా పీటీఎం నాటికి ప్రతి తల్లిదండ్రి మొబైల్‌లో లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, మార్కులు, ఆరోగ్య వివరాలు,




మధ్యాహ్న భోజన సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**హెల్త్ కార్డులు, ప్రోగ్రెస్ కార్డులు సిద్ధం చేయాలి**

విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులతో పాటు హెల్త్ కార్డులను కూడా అందించాలని, ఇంకా పూర్తి కాని ఆరోగ్య పరీక్షలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమన్వయం చేసి పూర్తి చేయించాలని కలెక్టర్ సూచించారు. ఈసారి మెగా పీటీఎంలో రంగవల్లుల పోటీలు, క్రీడా పోటీలు, పునాది అక్షరాస్యత–సంఖ్యాజ్ఞానం (ఎఫ్‌ఎల్‌ఎన్)పై అవగాహన, ఐఎఫ్‌పీ ప్యానెల్ల పనితీరు పరిశీలన, విద్యార్థుల కిట్ల పంపిణీ, 'డ్రగ్స్ వద్దు బ్రో' అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

**పాఠశాల అభివృద్ధి, పరిశుభ్రతపై దృష్టి**

*పాఠశాల అభివృద్ధి పనుల పురోగతిని ఫొటోలతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికల రూపంలో పంపించాలని, కొనసాగుతున్న మోడల్ పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం విడుదల చేసే ఏకరీతి మెనూనే అమలు చేయాలని, రాయలసీమ ప్రాంతీయ రుచులకు అనుగుణంగా*




*రూపొందించిన మెనూను పాటించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వంటశాలలు, వరండాలను డీప్ క్లీనింగ్ చేసి ఈగలు, అపరిశుభ్రత లేకుండా చూడాలని ఆదేశించారు.*

**గ్రీన్ పాస్‌పోర్ట్, డోనర్ యాప్‌పై ప్రత్యేక దృష్టి**


పాఠశాలల్లో నాటిన మొక్కలకు సంబంధించిన గ్రీన్ పాస్‌పోర్ట్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతల సహకారం పెంచేందుకు డోనర్ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని, మౌలిక సదుపాయాలకు సంబంధించిన విరాళాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. జూలై 24న ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మెగా పీటీఎంలో తల్లిదండ్రులకు స్వాగతం, లీప్, డోనర్ యాప్‌ల కోసం హెల్ప్‌డెస్క్‌లు, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల వ్యక్తిగత సమావేశాలు, విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన, ఎఫ్‌ఎల్‌ఎన్ అంశాలపై చర్చలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం విద్యా సామగ్రి ప్రదర్శన, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, లీప్ యాప్ ప్రదర్శన, డోనర్ యాప్ నమోదు, ముఖ్య అతిథుల సందేశాలు, ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించి, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద భోజన వడ్డనతో కార్యక్రమాన్ని ముగించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మెగా పీటీఎంను విజయవంతంగా నిర్వహించి, విద్యార్థుల అభ్యాస నాణ్యతతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

---

# ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలి.

**డిజిటలీకరణ, ఏఎస్‌డీ జాబితాలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సీఈఓ సమీక్ష.**
**సకాలంలో పెండింగ్ అంశాల పరిష్కారానికి అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆంధ్రప్రదేశ్‌లో 2026 ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. అమరావతి వెలగపూడిలోని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణలో భాగంగా డిజిటలీకరణ, ఏఎస్‌డీ ( ఆబ్ సెంట్ షిఫ్టెడ్ డెడ్) జాబితాల తయారీ, డీఎస్‌సీఎస్ అనామలీస్ పరిష్కారం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, బీఎల్‌ఓల పెండింగ్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ఎదురవుతున్న సమస్యలను జిల్లా వారీగా తెలుసుకున్నారు. డీఎస్–సీఎస్‌కు సంబంధించిన అనామలీస్‌ను వేగంగా పరిష్కరించాలని సూచించారు. బీఎల్‌ఓల వద్ద పెండింగ్‌లో ఉన్న (బుక్ ఎ కాల్ విత్ బిఎల్‌ఓ), ఇతర పెండింగ్ అంశాలను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ జరగని ఓటర్లను వెంటనే గుర్తించి మ్యాప్ చేయాలని, ఓటర్ల వివరాల్లో ఫోటోలు స్పష్టంగా లేకపోయినా లేదా పాత ఫోటోలు ఉన్నా వాటి స్థానంలో తాజా కలర్ ఫోటోలను అప్‌డేట్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో బీఎల్‌ఓల వద్ద ఉన్న పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. డీఎస్‌సీఎస్‌కు సంబంధించిన అనామలీస్ సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల నమోదు అధికారులు (ఈ ఆర్ ఓ ఎస్), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏ ఈ ఆర్ ఓ ఎస్), బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. మ్యాపింగ్ పూర్తికాని బీఎల్‌ఓలకు అవసరమైన శిక్షణ, అవగాహన కల్పించి త్వరితగతిన మ్యాపింగ్ పూర్తి చేయిస్తామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఇచ్చిన ప్రతి సూచనను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. డీఎస్‌సీఎస్ అనామలీస్, ఏఎస్‌డీ జాబితాల తయారీ, బీఎల్‌ఓ పెండింగ్ అంశాల పరిష్కారం, మ్యాపింగ్ సమస్యలు, ఫోటో అప్‌డేషన్ తదితర పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సూచించారు. వచ్చే శనివారం మరోసారి సమీక్ష నిర్వహిస్తానని... అప్పటిలోపు గణనీయమైన పురోగతి సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ ఒప్పందాలు రద్దు చేయాలి.

**-ఈ నెల 22న రాష్ట్రవ్యాప్త నిరసనలకు రైతు సంఘం పిలుపు.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత్––అమెరికా వ్యవసాయ రంగానికి సంబంధించిన ద్వైపాక్షిక ఒప్పందాలను తక్షణమే విరమించుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 24న కుదరనున్న ఒప్పందాలకు నిరసనగా జూలై 22న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రైతు సంఘాల ఐక్యవేదిక నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం నంద్యాలలోని నరసింహయ్య భవన్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రామచంద్రుడుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఒప్పందాల వల్ల మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పాల ఉత్పత్తులు తదితర వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి దేశీయ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. రైతులు పెద్ద ఎత్తున నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములను దీర్ఘకాల లీజుకు ఇవ్వడాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని, రైతుల భూముల హక్కులు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. భూములు కోల్పోయే రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున అన్ని పంటలకు పంట బీమా వర్తింపజేయడంతో పాటు రైతులపై ప్రీమియం భారం తగ్గించాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభాకర్ రెడ్డి కోరారు.

# మౌలాలి స్వామి సరిగెత్తు ప్రారంభం

బండి ఆత్మకూరు నంది పత్రిక జూలై 16: బండి ఆత్మకూరులో మౌలాలి స్వామి సరిగేత్తు ఉత్సవాలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లా వైఎస్ఆర్ పార్టీ మహిళా



సంఘం అధ్యక్షురాలు రాజంరెడ్డి సుజాతమ్మ స్వగృహము నుండి మేళ తాళాలు, భాజా భజంత్రీల మధ్య ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి పూల దట్టీలను సమర్పించారు. అనంతరం మౌలాలి స్వామి సంబంధించిన పీర్ల పెట్టెను గ్రామంలో ఊరేగించి, మటంపేటలోని హుస్సేన్ సావళి దర్గా వద్దకు తీసుకొని వచ్చి పాతేహ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నుండి 23వ తేదీ వరకు మౌలాలి స్వామి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఎలాంటి జంతువుల వధ నిర్వహించరాదని నిషేధం విధించారు. ఈ విషయంలో అందరూ సహకరించాలని ఉత్సవం కమిటీ విజ్ఞప్తి చేసింది.

# పచ్చని చెట్లకు ఇనుప పోట్లు.





రుద్రవరం. పల్లె వెలుగు : ప్రభుత్వాలు ఒక లక్ష్యంతో కోట్లాది రూపాయలను వెచ్చించి ఇంటికో మొక్క చొప్పున చెట్లను నాటి రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపాలన్న లక్ష్యంతో ఒకవైపు ముందుకు సాగుతుంటే మరోవైపు ప్రవేటు కంపెనీలకు చెందిన యాజమాన్యం మా కంపెనీలలో తయారయ్యే మందులను వాడితే రైతులు పండించే పంటలు అధిక దిగుబడులు వస్తాయని ఆశ చూపించేందుకు ఎక్కడపడితే అక్కడ రోడ్లకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద వృక్షాలకు వాళ్ళ కంపెనీలకు చెందిన మందుల బోర్డులను ఇనుప మేకులతో గుచ్చి పచ్చదనానికి , పర్యావరణానికి అడ్డంకులుగా చేస్తున్న వైఖరి మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని రెడ్డిపల్లి, నాగులవరం, తిప్పారెడ్డిపల్లి, నరసాపురం, హరి నగరం, ముకుందాపురం, చిత్తరేనిపల్లి, ఆలమూరు తదితర గ్రామాలలో వ్యవసాయ రైతులు వాణిజ్య పంటలను వందలాది ఎకరాలలో సాగు చేస్తున్నారు. వ్యవసాయ రైతులకు ఆశ గులిపే విధంగా మా కంపెనీలకు చెందిన విత్తనాలను వాడితే అధిక దిగుబడులను సాధిస్తారని, మా కంపెనీలకు చెందిన మందులను వాడితే ఎలాంటి తెగుళ్లు రాకుండా మంచి కాపులను అందిస్తాయని తెలిపే విధంగా రోడ్డుకి ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద వృక్షాలకు కంపెనీల బోర్డులను ఇనుప మేకులతో చెట్లకు గుచ్చి పచ్చదనానికి తూట్లు పొడుస్తున్న సంబంధిత అధికారులు ప్రైవేట్ యాజమాన్యాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ పలు గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పచ్చని చెట్లను బ్రతికించి పర్యావరణానికి మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఫేజ్-2 ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి.

☛పోస్టుల పునర్వ్యవస్థీకరణ, ఈ-కేవైసీ, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీపై ప్రత్యేక దృష్టి.

☛ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.రాష్ట్రంలో పరిపాలనా సంస్కరణల్లో భాగంగా గతంలో






జిల్లా స్థాయిలో ఉన్న పలు పోస్టులను జోనల్ పరిపాలనా పరిధిలోకి తీసుకువచ్చినట్లు సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. గురువారం అమరావతి నుండి పరిపాలనా పునర్వ్యవస్థీకరణ, పోస్టుల విభజన, ఫేజ్-2 ఉద్యోగాల భర్తీ, రెవెన్యూ సంబంధిత అంశాల పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ మాట్లాడుతూ, పరిపాలనా సంస్కరణల్లో భాగంగా గతంలో జిల్లా స్థాయిలో ఉన్న పలు పోస్టులను జోనల్ పరిపాలనా పరిధిలోకి తీసుకువచ్చామని తెలిపారు. కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీ-జోన్ల ఏర్పాటుకు అనుగుణంగా పోస్టుల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నామని, ఇందుకు సంబంధించిన అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులను ఆర్థిక శాఖ, సాధారణ పరిపాలన శాఖల ద్వారా దశలవారీగా జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఫేజ్-2 ఉద్యోగ నియామకాల కింద రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,468 ఖాళీలను గుర్తించినట్లు పేర్కొంటూ, ఆయా పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ ప్రక్రియను 2026 ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన శాఖలు, కేడర్లలో పోస్టుల విభజన ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ, ఫేజ్-2 ఖాళీల భర్తీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. పోస్టుల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి అవసరమైన అన్ని వివరాలను కాడస్ట్రల్ విభాగానికి పంపించినట్లు, సంబంధిత పత్రాల ధృవీకరణ (డాక్యుమెంట్ వెరిఫికేషన్) ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ తుది దశకు చేరుకుందని, మరో రెండు రోజుల్లో సుమారు 25 పాస్‌బుక్స్ అందనున్నాయని, అనంతరం మిగిలిన పాస్‌బుక్స్ పంపిణీని కూడా పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే ఆగస్టు నెల కార్యాచరణలో భాగంగా 28 గ్రామాలను ఎంపిక చేశామని, సంబంధిత డేటా శాతాన్ని పరిశీలించి అవసరమైన సవరణలు చేసి అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించామన్నారు. డ్రాఫ్ట్ ఈ-కేవైసీతో పాటు ఇతర రిమార్క్స్ ఎంట్రీల ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు.

# పారిశుద్ధ్య పనులను పక్కాగా చేపట్టాలి

● గార్బేజ్ పాయింట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● ప్రతి ఒక్కరూ ఉత్తమ పనితీరును కనబరచాలి

● కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా, పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఏ.క్యాంపు, జొహరపురం ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం సెట్కూరు కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడి నిర్వహణ, పరిశుభ్రతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని గార్బేజ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా సకాలంలో తరలింపు చేపట్టాలని సూచించారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రోజూ నిర్దేశిత పనులను పూర్తిచేయాలని, ప్రతి ఒక్కరూ ఉత్తమ పనితీరును కనబరుస్తూ నగర పరిశుభ్రతకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య సేవలను నిరంతరం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**- ఎస్సై జయ శేఖర్**

కొత్తపల్లి- పల్లె వెలుగు : ఓ మహిళను అసభ్య పదజాలంతో వేధిస్తున్న వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై జయ శేఖర్ తెలిపారు వివరలవెళ్తే మండలంలో గువ్వలగుంట్ల గ్రామానికి చెందిన నరాల రేణుక అనే మహిళను అతని మరిది అయినా వెన్నుపూస మధుసూదన్ రెడ్డి వాట్సప్ వేదిక ద్వారా అసభ్య పదజాలం ఉపయోగించి దూషించడమే కాకుండా, వాట్సాప్ గ్రూపులలో ఆమెపై అవాస్తవ ఆరోపణలు చేస్తూ దూషించాడు. నిందితుడు ఫిర్యాదుదారు సోదరి భర్త కావడం, వారి మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా ఈ సంఘటన చోటుచేసుకుంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి ఎస్సై జయ శేఖర్ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది

# మండల ఎంపీడీవో వాసుదేవ గుప్త..

**ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు..**





గడివేముల పల్లెవేలుగు దిన పత్రిక నంద్యాల జిల్లా గడివేముల మండలం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నిర్వహించిన జి పి డి పి కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు నాగమద్దమ్మ , ఎంపీడీవో వాసుదేవగుప్త, ట్రెనింగ్ అధికారులు పాల్గొని అన్ని శాఖ అధికారులతో ఈ ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశం గురించి వివరించారు.

2026-27 సంవత్సరానికి గాను పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ చేపట్టిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (+ణాఖా) జి పి డి పి. అనేది స్థానిక ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను అభివృద్ధి చేసే వార్షిక ప్రణాళిక. ఇందులో అన్ని శాఖ అధికారులతో పలు సేవలు గురించి ఇందులో పేదరిక నిర్మూలన, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, మరియు మహిళా సాధికారత వంటి 10 ప్రధాన అంశాలపై దృష్టి పెట్టి ఈ ప్రణాళికను తయారుచేస్తారు. ఈ ప్రణాళిక తయారీలో ముఖ్యాంశాలు:పారదర్శకత మరియు ప్రణాళిక: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రతి పంచాయతీ ఇ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్ మరియు 'గ్రామ్ మంచిత్ర' ద్వారా డిజిటల్ పద్ధతిలో తమ ప్రణాళికలను రూపొందించి నమోదు చేస్తాయి. 16వ ఆర్థిక సంఘం నిధులు: రాబోయే కాలానికి 16వ ఆర్థిక సంఘం నిధుల మార్గదర్శకాలను అనుసరించి, గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన నిధులను పక్కాగా కేటాయించడం ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశం. గ్రామ సభలు: స్థానిక ప్రజలు, స్వయం సహాయక సంఘాలు, మరియు ఫ్రంట్‌లైన్ వర్కర్ల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి, ప్రజల అవసరాలు మరియు ప్రాధాన్యతలను గుర్తిస్తారు. సమీకృత అభివృద్ధి: ఇది కేవలం రోడ్లు, డ్రైనేజీలకే పరిమితం కాకుండా, విద్య, వైద్యం, తాగునీరు, మరియు వ్యవసాయాభివృద్ధి వంటి పది కీలక రంగాలపై దృష్టి సారిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఎం ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్,స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన ప్రతినిధులు, హౌసింగ్ ,ఐ సి డి ఎస్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ,మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ,డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ,తదితరులు పాల్గొన్నారు,

## ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థులకు భారతీయ

# ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల స్టిక్కర్లు పంపిణీ.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఈ రోజు "భారతీయ ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల స్టిక్కర్లను" ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల, నంద్యాల విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి ఆరు స్టిక్కర్లు, విజయవంతంగా పంపిణీ చేశాము. భారత స్వాతంత్ర్య సమరంలో భారతీయ ముస్లింలు చేసిన అమూల్యమైన త్యాగాలు, సేవలు మరియు విశిష్టమైన పాత్ర గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జనాబ్ కరీముల్లా గారు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జనాబ్ ఎం.బి.టి. బాబు (సోఫీ సాహెబ్), జనాబ్ ఇమ్రాన్ పాషా గారు ఆల్ మెగా రాష్ట్ర అధ్యక్షులు మరియు ఎస్. మహమ్మద్ అబులైస్ గౌరవ అధ్యక్షులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ భారత దేశంలోనే ముస్లింలలో సుమారు 99 శాతం మంది భారతదేశ మూలవాసులే అని నేడు కొందరు మతతత్వవాదులు, ఏనాడు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని పూర్వీకుల సంతానం నేడు ముస్లింల దేశభక్తి గురించి ప్రశ్నించడం విడ్డూరంగా ఉందని, అటువంటివారు ఇండియా గేట్ పైన ఉన్న 65 వేల మంది ముస్లింల పేర్లు చూసుకోవాలని, సుభాష్ చంద్రబోస్ స్థాపించిన "ఆజాద్ హింద్ ఫౌజ్" లో చాలామంది కమాండర్లు ముస్లింలే నని గుర్తు పెట్టుకోవాలని అన్నారు. 1857 తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామం అనంతరం బ్రిటిష్ పాలకులు వేలాది మంది భారతీయులను, వారిలో అనేక మంది ఉలేమా, సైనికులు మరియు సాధారణ ప్రజలను అత్యంత క్రూరంగా హతమార్చారు. ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ఉరిశిక్షలు, సామూహిక కాల్పులు, ఫిరంగులకు కట్టి పేల్చివేయడం వంటి అమానుష శిక్షలు అమలు చేశారు. ఈ త్యాగాలు భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఒక విషాదకరమైన, కానీ గర్వించదగిన అధ్యాయం." అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ స్వీట్లు మరియు ఖారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో జనాబ్ జాకీయుల్లా, జనాబ్ అబ్దుల్లా, కరాటే మహబూబ్ బాషా, జనాబ్ బషీర్ మరియు కళాశాల సిబ్బంది అందరూ చురుకుగా పాల్గొని తమ వంతు సహకారాన్ని అందించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ కి, అధ్యాపక బృందానికి, విద్యార్థులందరికీ మరియు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని తెలిపారు.

# కలంపై కక్షసాధింపు.. జర్నలిస్టు వెంకట్‌పై వరుస దాడులు దుర్మార్గం!

**భార్యతో సహా విలేకరిపై భౌతిక దాడులా?**

**ప్రజాస్వామ్యం ఎటు పోతోంది?**

**నిందితుడు డానియల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి.. 'యూజేఎఫ్' అల్టిమేటం**

**తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ముట్టడి తరహాలో వినతిపత్రాల అందజేత**






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో నిజాలను నిర్భయంగా రాస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తే జర్నలిస్టులపై వరుస దాడులకు తెగబడటం అరాచకత్వానికి పరాకాష్ట అని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు అని యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు నీలం సత్యనారాయణ నిప్పులు చెరిగారు. ప్రజాశక్తి విలేకరి పి. వెంకట్, ఆయన కుటుంబం లక్ష్యంగా సాగుతున్న వేధింపులు, భౌతిక దాడులను నిరసిస్తూ గురువారం సి.బెళగల్ మండల జర్నలిస్టులు ఆగ్రహోదగ్రులయ్యారు. యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు లక్ష్మన్న నేతృత్వంలో జర్నలిస్టులంతా ఏకమై నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ మధుకు, పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్పకు వినతిపత్రాలు అందజేసి, తక్షణ న్యాయం కోసం డిమాండ్ చేశారు.

**నాలుగు నెలల వేధింపులు.. ఖాకీల నిర్లక్ష్యంపై జర్నలిస్టుల ఆగ్రహం!**

ఈ సందర్భంగా నీలం సత్యనారాయణ, జిల్లా నాయకులు వారణాసి ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజంలో అన్యాయాలను ఎండగడుతున్న విలేకరి పి. వెంకట్‌పై డానియల్ అనే వ్యక్తి గత నాలుగు నెలలుగా పగబట్టినట్లు వ్యవహరిస్తూ, నిరంతరం మానసిక వేధింపులకు, ప్రాణాపాయ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. అంతటితో ఆగక, ఇటీవల వెంకట్‌తో పాటు ఆయన భార్యపై కూడా అత్యంత క్రూరంగా భౌతిక దాడికి తెగబడటం సమాజం తలదించుకునే చర్య అని మండిపడ్డారు. ఈ దాడుల వెనుక ఉన్న శక్తులెవరో తేల్చాలని, నిరంతరం భయాందోళనల మధ్య కొట్టుమిట్టాడుతున్న విలేకరి కుటుంబానికి తక్షణమే పూర్తిస్థాయి పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

**"కలం గొంతు నొక్కితే.. ఉద్యమాల ఉప్పెన తప్పదు!"**

"జర్నలిస్టులపై దాడులు చేసైనా సరే నిజాలను దాచేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. కలం గొంతు నొక్కాలని చూసే శక్తుల ఆట కట్టిస్తాం. నిందితుడు డానియల్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. బాధిత జర్నలిస్ట్ కుటుంబానికి రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకం చేసి పోలీసు యంత్రాంగం ఉలిక్కిపడేలా ఉద్యమిస్తాం."
--- నీలం సత్యనారాయణ, యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు

**కదిలిన యంత్రాంగం.. అధికారుల హామీ**

జర్నలిస్టుల ఆగ్రహాన్ని చూసి స్పందించిన జూనియర్ అసిస్టెంట్ మధు, హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప వినతిపత్రాలను స్వీకరిస్తూ.. ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. తక్షణమే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని, బాధిత విలేకరికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

**జర్నలిస్టుల సంఘీభావ గర్జన:**

ఈ నిరసన, వినతిపత్రాల అందజేత కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు లక్ష్మన్న, జిల్లా నాయకులు వారణాసి ప్రసాద్, లక్ష్మీనారాయణ, మల్లికార్జునలు ముందుండి నడిపించారు. వీరికి మద్దతుగా కోడుమూరు జర్నలిస్టులు తిరుమల్, షఫీ, మహబూబ్, అలాగే సి. బెళగల్ జర్నలిస్టులు బడేశావ్, పి. వెంకట్, యువరాజు, మాణిక్యం తదితరులు భారీ సంఖ్యలో తరలివచ్చి జర్నలిస్ట్ వెంకట్‌కు అండగా నిలబడి తమ సంఘీభావాన్ని చాటారు.

# గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి పి డి పి).

**- 2026-27 తయారీ పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండల ప్రజా



పరిషత్ కార్యాలయంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) తయారీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారదర్శకంగా, ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రతి గ్రామంలోనూ వార్డు సభలు, గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల ద్వారా ప్రజల నుంచి నేరుగా ప్రాధాన్యత కలిగిన అవసరాలను, సమస్యలను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని స్పష్టం చేశారు. సమావేశంలో శిక్షణ మరియు కీలక మార్గదర్శకాలు నిధుల లభ్యత అంచనాలు 16వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీల సొంత వనరుల ఆదాయం (ఓన్ సోర్స్ రెవెన్యూ), జల జీవన్ మిషన్, నేషనల్ హెల్త్ మిషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులను సమన్వయం చేసుకుంటూ నిధుల అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలి. ప్రాధాన్యత పనులు తాగునీటి అవసరాలు, మౌలిక వసతులు, ఆరోగ్యం, పారిశుధ్య పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ నిధుల కేటాయింపులు జరపాలి.

ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ అప్‌లోడ్ గ్రామ సభల ఆమోదం మరియు తీర్మానం (రేసులేషన్) తప్పనిసరిగా పొందిన తర్వాతే, తుది ప్రణాళికను ఈ-గ్రామ స్వరాజ్" పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులకు ప్రణాళిక తయారీ, నిధుల వినియోగం మరియు సాంకేతిక అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎంపీడీఓ నాగరాజు, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు, రిసోర్స్ పర్సన్ శశికళ, మండల ఇంజనీరింగ్ అధికారి యమునప్ప, పంచాయతీ అభివృద్ధి అధికారులు (పి డి ఎస్ ఓ), డిజిటల్ అసిస్టెంట్లు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, వ్యవసాయ, డీఆర్‌డీఏ (డి ఆర్ డి ఏ), వీబీజీ రామ్‌జీ సిబ్బంది, ఐసీడీఎస్ (ఐసిడిఎస్), రెవెన్యూ, పశుసంవర్ధక, విద్యా, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులపై పంటల బీమా భారం మోపడం దారుణం

**పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరించాలి,,,,**




ఎమ్మిగనూరు పల్లె వెలుగు జులై 16 వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్. మురహరి రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతులపై (పంటల బీమా) పేరుతో టీడీపీ ప్రభుత్వం అదనపు ఆర్థిక భారం మోపడం అత్యంత దురదృష్టకరమని, రైతు వ్యతిరేక చర్యగా దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్. మురహరి రెడ్డి అన్నారు. 2019 నుండి 2024 వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులపై ఒక్క రూపాయి భారం పడకుండా పంటల బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించింది. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఆ ప్రభుత్వం రైతుకు అండగా నిలిచింది. కానీ ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం రైతుల నుంచే పంటల బీమా ప్రీమియం పేరుతో డబ్బులు వసూలు చేస్తూ రైతుల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. అప్పుల ఊబిలో ఉన్న రైతులు రోజువారీ ఖర్చులకే ఇబ్బంది పడుతున్న పరిస్థితిలో ఎకరాకు వేల రూపాయల చొప్పున పంటల బీమా ప్రీమియం ఎలా చెల్లించగలరని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. రైతును ఆదుకోవాల్సిన ప్రభుత్వం, రైతు జేబులో చేయి పెట్టి డబ్బులు వసూలు చేయడం సిగ్గుచేటు. పంటల బీమా రైతుకు రక్షణగా ఉండాలి గానీ, రైతుపై భారంగా మారకూడదు. అంతేకాకుండా, పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు కూడా అత్యంత తక్కువగా ఉండటం వల్ల వేలాది మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలామందికి సమాచారం తెలిసేలోపే గడువు ముగిసిపోయింది. చివరి రోజుల్లో నెట్ సెంటర్ల వద్ద రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు గంటల తరబడి క్యూల్లో నిలబడి తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రభుత్వం సరైన ప్రచారం చేయకుండా, తగినంత సమయం ఇవ్వకుండా రైతులను నెట్ సెంటర్ల చుట్టూ తిప్పడం పూర్తిగా పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం. రైతుల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వం, రైతులను అవస్థలకు గురిచేసి, వారి సమయాన్ని, డబ్బును వృథా చేయడం ఎంతవరకు సమంజసం? రైతుల సంక్షేమం గురించి గొప్పలు చెప్పే ముందు రైతుల కష్టాలను అర్థం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాం. రైతుల నుంచి పంటల బీమా ప్రీమియం వసూలు చేయడం వెంటనే నిలిపివేసి, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ మాదిరిగానే పంటల బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించేలా తక్షణ నిర్ణయం తీసుకోవాలి. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. రైతుపై భారాలు మోపడం కాదు, రైతుకు భరోసా ఇవ్వడమే ప్రభుత్వ బాధ్యత. రైతు వ్యతిరేక నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకుని రైతుల ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కె.ఆర్. మురహరి రెడ్డి గట్టిగా డిమాండ్ చేశారు.

# శతాబ్దాల భూకలహానికి మోక్షం.. 500 కుటుంబాల కల సాకారం!

**22-ఏ నిషేధిత జాబితా నుంచి చింతల ముని నగర్ భూములు విముక్తి**

**కల్లూరు మండల బాధితుల వందేళ్ల నిరీక్షణకు తెరదించిన కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

**కలెక్టరేట్‌లో అధికారులకు లబ్ధిదారుల ఘన సన్మానం.. కన్నీటితో కృతజ్ఞతలు**







పల్లె వెలుగు కర్నూలు బ్యూరో దాదాపు వందేళ్లుగా పరిష్కారానికి నోచుకోక, తరతరాలుగా కంటిమీద కునుకు లేకుండా చేసిన ఒక జటిలమైన భూ సమస్యకు కర్నూలు జిల్లా యంత్రాంగం శాశ్వత ముగింపు పలికింది. కల్లూరు మండలం చింతల ముని నగర్ పరిధిలోని సర్వే నంబర్ 448/ఏ3లో గల 8.10 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి దశాబ్దాలుగా పీడిస్తున్న '22-ఏ నిషేధిత జాబితా' చిక్కుముడి ఎట్టకేలకు వీడింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తీసుకున్న ప్రత్యేక చొరవతో ఈ భూమి నిషేధిత జాబితా నుండి తొలగించబడటంతో.. ఇక్కడి 500 పేద కుటుంబాలకు సొంత ఇంటి పట్టాల భాగ్యం దక్కినట్లయింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో దశాబ్దాల మానసిక వేదన నుంచి విముక్తి పొందిన లబ్ధిదారులు గురువారం కలెక్టరేట్‌కు తరలివచ్చి.. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహా రెవెన్యూ అధికారులను శాలువాలతో ఘనంగా సత్కరించి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాతల కాలం నాటి నివాసం.. కొనేందుకు, అమ్మేందుకు లేని హక్కు!

చింతల ముని నగర్‌లో దాదాపు 500 కుటుంబాలు తమ పూర్వీకుల కాలం నుండి (వందేళ్లకు పైగా) అక్కడే నివాసముంటున్నాయి. 1982 లోనే వీరికి పట్టాలు మంజూరైనప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల ఈ భూమి 22-ఏ నిషేధిత జాబితాలోకి వెళ్ళిపోయింది. దీంతో ఈ భూములను అమ్ముకోవడానికి గానీ, వేరే వాళ్లకు బదలాయించడానికి గానీ వీలు లేక ఆ కుటుంబాలు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. ప్రస్తుతం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన రెవెన్యూ యంత్రాంగం.. ఆ నిబంధనలను సడలించి పేదల పక్షాన నిలిచింది.

జిల్లాలో మరో 20 ప్రధాన సమస్యల ప్రక్షాళన: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

"మీ కళ్లల్లో ఆనందమే మాకు సంతృప్తి!"

"ఒకే సమస్యతో వందలాది కుటుంబాలు నలిగిపోతున్నప్పుడు దానిని ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించడం మా బాధ్యత. మొదట వీరంతా ఏదైనా సమస్యతో వచ్చారనుకున్నా.. కానీ వందేళ్ల సమస్య తీరిన ఆనందాన్ని పంచుకోవడానికి వచ్చారని తెలిసి మనసు నిండిపోయింది. జిల్లాలో ఇలాంటి మరో 20 ప్రధాన భూ సమస్యలను గుర్తించాం. పట్టా, ఇనాం, ప్రభుత్వ భూములతో పాటు 22-ఏ జాబితాలో ఉన్న లోపాలను సరిచేస్తూ భూ రికార్డులను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నాం. భవిష్యత్తులో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, రీ-సర్వే పాస్ బుక్ ల జారీకి ముందే ఆన్‌లైన్ రికార్డులను క్షుణ్ణంగా సరిచేస్తున్నాం."

--- డాక్టర్ ఏ.సిరి, జిల్లా కలెక్టర్

"ఇన్నేళ్ల టెన్షన్ ఒక్కరోజులో పోయింది" -- భావోద్వేగంలో లబ్ధిదారులు

"ఎన్నో ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాం. ఆశలు పూర్తిగా వదిలేసుకున్న తరుణంలో కలెక్టర్ దైవంలా చొరవ తీసుకుని మా సమస్యకు ముగింపు పలికారు. ఇన్నేళ్లుగా గుండె మీద మోసిన మానసిక భారం ఈరోజుతో దిగిపోయింది" అంటూ లబ్ధిదారులు భావోద్వేగానికి గురయ్యారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. "ఈ విజయం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి అర్హుడికి న్యాయం చేయడమే అధికారుల కర్తవ్యం" అని పేర్కొన్నారు. అయితే వేలాది పెండింగ్ కేసులను ఒక్కోటిగా పరిశీలిస్తున్నామని, అందరికీ ఒకేసారి న్యాయం చేయలేకపోవడమే తమకున్న ఏకైక బాధని ఆమె వ్యాఖ్యానించారు.

అధికారులకు ఘన సత్కారం:

ఈ చారిత్రాత్మక ఘట్టానికి కారకులైన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ ఆంజనేయులును లబ్ధిదారులు శాలువాలు, పూలమాలలతో ముంచెత్తి, పుష్పగుచ్ఛాలు అందజేసి తమ కృతజ్ఞతాపూర్వక సంతోషాన్ని చాటుకున్నారు.

## కాట్రేనికోన లో పులి సంచారంపై పుకార్లు ! అది 'అడవి పంది' అడుగులేనని స్పష్టం చేసిన అటవీశాఖ

కాట్రేనికోన,జూలై 16(పల్లె వెలుగు): కాట్రేనికోన మండలంలోని సముద్ర తీర ప్రాంతంలో



పులి సంచరిస్తోందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. పులి పాదముద్రలుగా పేర్కొంటూ కొన్ని ఫోటోలు కూడా వైరల్ అవుతున్నాయి. ఈ విషయంపై స్పందించిన కందికుప్ప అటవీశాఖ అధికారులు, వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పులి సంచారం జరుగుతుందన్న ప్రచారంలో నిజం లేదని వారు స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఆవులు పెద్ద సంఖ్యలో మేత కోసం తిరుగుతుంటాయని, ఒకవేళ పులి ఉండి ఉంటే పశువులపై దాడులు జరిగేవని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాయిబాబా వివరించారు. ప్రస్తుతం ఆ తీర ప్రాంతంలో అడవి పందుల సంచారం ఎక్కువగా ఉందని, వైరల్ అవుతున్న ఫోటోలలోని పాదముద్రలు పులివి కావని, అవి అడవి పందులవేనని ఆయన ధృవీకరించారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో గొల్లపేటకు చెందిన కొందరు గ్రామస్తులు ఇదే అనుమానాన్ని వ్యక్తం చేయగా, అప్పట్లో కూడా అటవీ శాఖ అధికారులు విచారణ జరిపి అవి అడవి పందుల కాలి గుర్తులని నిర్ధారించారని ఆయన గుర్తు చేశారు.కాబట్టి, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని, ఇటువంటి వదంతులను నమ్మవద్దని అటవీ శాఖ అధికారులు కోరుతున్నారు.

## కాట్రేనికోనలో ఘోర ప్రమాదం.. అదుపుతప్పి తిరగబడిన మట్టి ట్రాక్టర్!

కాట్రేనికోన, జూలై 16(పల్లె వెలుగు): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం వేట్లపాలెం లో మట్టి రవాణా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని వేట్లపాలెంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మట్టిని తరలిస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి తిరగబడటంతో, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రుడిని ప్రాథమిక చికిత్స కోసం కాట్రేనికోన లోని స్థానిక వైద్యుడి వద్దకు తరలించారు. అయితే, గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అతడిని అమలాపురంలోని కిమ్స్ (ఖ×మీా) ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ మట్టిని ఎక్కడి నుండి, ఎక్కడికి తరలిస్తున్నారు? అసలు ఈ మట్టి తరలింపుకు సంబంధిత శాఖల నుండి అనుమతులు ఉన్నాయా? లేదా అక్రమంగా తరలిస్తున్నారా?ప్రమాదానికి గురైన ట్రాక్టర్ ఎవరిది? డ్రైవర్ వివరాలేంటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది. నిబంధనలను పక్కనబెట్టి మట్టి తరలింపు జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, సంబంధిత అధికారులు వెంటనే రంగంలోకి దిగి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## బాక్సైడ్ రహస్య సర్వేపై ఆదివాసీల సమరశంఖం -18న జర్రెలో భారీ బహిరంగ సభ!

అల్లూరి సీతారామరాజు జిల్లా, జూలై 16(పల్లె వెలుగు):) ప్రతినిధి పాంగి దావీదు:ఏజెన్సీ




ప్రాంతాల్లో బాక్సైడ్ తవ్వకాల కోసం ప్రభుత్వం రహస్యంగా సర్వే నిర్వహిస్తోందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. దీనిపై ప్రజా సంకల్ప వేదిక ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ సర్వేపై స్పష్టమైన ప్రకటన చేయాలని, ఆదివాసీల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ సర్వే అనుమతు లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. గిరిజన ప్రాంతాల్లోని భూములకు రక్షణ కల్పించే 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, అడవులపై ఆదివాసీల హక్కులను కాపాడుకోవాలని ప్రజా సంకల్ప వేదిక పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ఈ పోరాటంలో భాగంగా, ఈనెల 18వ తేదీ, 2026 న జీకే వీధి మండలం, జర్రెల పంచాయతీ పరిధిలోని అసంపల్లి గ్రామంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ప్రజా సంకల్ప వేదిక ప్రతినిధులు ప్రకటించారు.ఈ సందర్భంగా ప్రజా సంకల్ప వేదిక ఆర్టిఐ స్టేట్ వాయిస్ ప్రెసిడెంట్ పాంగి రామ్, అల్లూరి జిల్లా ప్రెసిడెంట్ పాంగి కృష్ణారావు, ఆర్టిఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గెమ్మెలి రామారావు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ గిరిజన సోదరులందరూ ఈ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభలో బాక్సైడ్ తవ్వకాల దుష్ప్రభావాల గురించి, చట్టపరమైన రక్షణ గురించి వివరించనున్నట్లు వారు వెల్లడించారు. గిరిజన హక్కుల పరిరక్షణ కోసం సాగించే ఈ పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నరసన్నపేటలో వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర: భక్తుల కోలాహలం



నరసన్నపేట, జూలై 16(పల్లె వెలుగు): నరసన్నపేటలోని సత్యవర అగ్రహారంలో వెలసిన జగన్నాథ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రతి ఏటా నిర్వహించే జగన్నాథ స్వామి రథయాత్రను పురస్కరించుకుని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరుగుతాయి. రథయాత్రకు మూడు రోజుల ముందు నుండే సత్యవర అగ్రహారం ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, విశేషార్చనలు నిర్వహిస్తారు.రథయాత్ర రోజున సత్యవర అగ్రహారం నుండి నరసన్నపేట పెద్దపేటలో గల జగన్నాథ స్వామి ఆలయం వరకు స్వామివారి ఊరేగింపు అత్యంత ఘనంగా జరుగుతుంది. ఈ ఊరేగింపులో భక్తులు భజనలు చేస్తూ, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. ఊరేగింపు అనంతరం నరసన్నపేట పెద్దపేటలోని ఆలయంలో స్వామివారికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక అలంకరణలు, నిత్య పూజలు నిర్వహిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి తరిస్తారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని నిర్వాహకులు భక్తులను కోరుతున్నారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com